సాక్షి కర్నూలు

సోమవారం | 13 | జనవరి | 2025



హమ్మయ్యా.. బిడ్డ దొరికాడు!

గత నెల కిడ్నాప్‌నకు గురైన ఎనిమిది నెలల బాలుడు క్షేమంగా ఇంటికి చేరుకున్నాడు. బాలుడిని అపహరించిన దుండగులు తిరిగి వది లేయడంతో తల్లిదండ్రుల్లో ఆనందం నెలకొంది. 10లో▸



శ్రీమఠం కిటకిట

మంత్రాలయం: వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో శ్రీమఠం కిటకిటలాడింది. గ్రామ దేవత మంచాలమ్మ, రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి పూజలు నిర్వహించారు.



'వివేక' స్ఫూర్తి

వివేకానంద స్వామి జయంతి పురస్కరించుకుని జాతీయ యువజన దినోత్సవాన్ని ఆదివారం ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఘనంగా నిర్వహించారు. అంతటా ఆయనకు నివాళులర్పించారు.

న్యూస్‌రీల్

15 వరకు కర్నూలు మార్కెట్‌కు సెలవులు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈనెల 15 వరకు సెలవులు ప్రకటించారు. సంక్రాంతి పండగ నేపథ్యంలో ఈ నెల 13, 14, 15 తేదీల్లో మార్కెట్‌కు సెలవులు ప్రకటించడంతో ఎలాంటి వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాలు జరుగవు. ఈ నెల 16వ తేదీ నుంచి యథావిధిగా క్రయవిక్రయాలు జరుగుతాయని మార్కెట్‌కమిటీ అధికారులు తెలిపారు.

నేటి ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ఈనెల 13వ తేదిన నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం సంక్రాంతి పండుగ భోగి వేడుకల నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయానికి సెలవు ఉండడంతో పీజీఆర్‌ఎస్‌ను రద్దు చేసినట్లు చెప్పారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు.

వ్యవసాయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

- ఆత్మ డీపీడీ శ్రీలత సూచనలు

కర్నూలు(అగ్రికల్చర్): ఇన్‌పుట్ డీలర్లు వ్యవసాయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఆత్మ డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీలత అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సమావేశ మందిరంలో ఇన్‌పుట్ డీలర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆత్మ డీపీడీ మాట్లాడుతూ... నేల రకాలు, వాటి స్వభావాలపై అవగాహన కల్పించారు. నేలలో సేంద్రియ కర్బనం పెంచేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దానిని వివరించారు. ఇన్‌పుట్ డీలర్లలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య పద్ధతులపై అవగాహన పెంచేందుకు జాతీయ వ్యవసాయ విస్తరణ యాజమాన్య సంస్థ ఆత్మ ద్వారా దేశీ డిప్లొమా కోర్సు కింద 48 వారాల పాటు శిక్షణ ఇస్తుందని పేర్కొన్నారు. రైతులు అన్ని అవసరాలకు ఇన్‌పుట్ డీలర్లనే ఆశ్రయిస్తుంటారని, దేశీ డిప్లొమా కోర్సు ద్వారా మంచి విషయాలు తెలుసుకొని సలహాలు, సూచనలు ఇవ్వాలని సూచించారు. కోర్సు సమన్వయ కర్త, విశ్రాంత జేడీఏ జయచంద్ర, 40 మంది ఇన్‌పుట్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆనందంగా పండుగ జరుపుకోవాలి

కర్నూలు(సెంట్రల్): భోగి, సంక్రాంతి, కనుమ పండుగ సందర్భంగా మంత్రి టీజీ భరత్, కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదివారం ఓ ప్రకటనలో జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. పండుగ సందర్భంగా జిల్లా ప్రజలందరికీ సుఖ సంతోషాలు, భోగభాగ్యాలు, సిరి సంపదలు కలగాలని, పండుగ ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. మొదటి రోజు భోగి మంటలతో.. రెండో రోజు సంక్రాంతి పండుగను పొంగలి, పిండివంటకాలతో, మూడో రోజు కనుమను ఇంటిల్లిపాది సంతోషంగా జరుపుకోవాలన్నారు.



కన్నమడకల గ్రామం



ఓర్వకల్లు మండలం కన్నమడకలలో రచ్చకట్ట మీద గ్రామస్తులు

- కళ తప్పిన గ్రామీణ ప్రాంతాలు
- కనిపించని పండుగ వాతావరణం
- ప్రతి ఒక్కరిలోనూ నిరుత్సాహం
- రాష్ట్ర ప్రభుత్వ తీరుపై ఆగ్రహం
- సంక్షేమ పథకాలు అందకపోవడంపై ఆందోళన
- 'భోగి' భాగ్యాలు లేక పల్లెసీమలు వెలవెల

పంటల్లేవు.. పథకాల్లేవు

ఇంక్యాడ పండుగ!

''సంక్రాంతి పండుగ.. మూడురోజులుగా బస్సులు.. రైళ్ల రద్దీ..కోళ్లపందేలు.. బంధువుల హడావుడి.. హైదరాబాద్, బెంగళూరు నుంచి ఆంధ్రప్రదేశ్‌కు వేలవాహనాలు.. టోల్‌గేట్ల దగ్గర బారులు తీరాయి'' అంటూ టీవీలు, సోషయల్ మీడియాలో వార్తలు. అందరి స్టేటస్‌లో 'పండక్కి మా ఊరికి వెళుతున్నాం!' అనే సమాచారం. ఈ క్రమంలో కర్నూలు జిల్లాలో పండుగ ఎలా జరుపుకుంటున్నారు, 'సంక్రాంతి'కి పల్లె ఎలా ముస్తాబైంది, ఏ సంబరాలకు సిద్ధమైంది.. తదితర విషయాలు తెలుసుకునేందుకు 'సాక్షి' ఆదివారం పల్లెబాట పట్టింది. పాణ్యం నియోజకవర్గం ఓర్వకల్లు మండలం కన్నమడకలకు ఉదయం 9.45గంటలకు చేరుకున్నాం. ఊళ్లోకి వెళితే బంధువుల హడావుడి, ఇళ్లముందు ముగ్గులు, రంగుల కొనుగోలు ఇలా సందడిగా ఉంటుందని అనుకున్నాం. అయితే ఊరంతా బోసిపోయి ఉంది. ఊళ్లోకి వెళ్లగానే చెన్నకేశవస్వామి గుడి ఎదురుగా ఉన్న రచ్చకట్టపై ఊళ్లోవాళ్లు కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. అక్కడికి వెళ్లి వారితో మాట కలిపాం. 'సంక్రాంతి ఎలా జరుపుకుంటున్నారు.. బంధువులను, ఆడపిల్లలు, అల్లుళ్లను ఇళ్లకు పిలిపించుకుంటున్నారా?' అని ఆరా తీశాం. 'ఎక్కడ పండుగ సార్! పంటలు చేతికి రాక దిక్కుతెలీడం లేదు. పోయిన సంక్రాంతితో పోలిస్తే కూలీ రేట్లు భారీగా పెరిగాయి. పంట ఆదాయం తగ్గింది. సాగు నుంచి పంట కోత వరకూ అప్పులు చేసుకుని మా తిప్పలు మేం పడుతుండాం.. ఇంకెక్కడ పండుగ' అని రైతులంతా మూకుమ్మడిగా గొంతు కదిపారు. ఆ ఊళ్లో 1500 ఎకరాలకు పైగా పొగాకు సాగు చేస్తారు. ఊళ్లోని 781 కుటుంబాలు ఈ పంటపైనే ఎక్కువ ఆధారపడతారు. 'పోయిన సంక్రాంతికి ఆడోళ్ల కూలి రూ.300, మగవారికి రూ.500 ఉండేది. ఇప్పుడు ఆడోళ్లకు రూ.500, మగోళ్లకు రూ.700 ఇస్తున్నాం. పోనీ.. పంట ఆదాయం పెరిగిందా? పోయిన పండక్కి మార్కెట్‌కు తీసుకెళ్లిన పొగాకు మొత్తానికి క్వింటా రూ.15వేలు చొప్పున ఇచ్చారు. ఇప్పుడు తడిసిందని, క్వాలిటీ లేదని రూ.8–10వేలు ఇస్తాండారు. బ్రహ్మాండంగా ఉంటేనే రూ.15వేలు వస్తాది. ఎకరాకు రూ.50వేల చొప్పున పెట్టుబడి పెట్టాం. బాగా పండితే ఎకరాకు 10 క్వింటాళ్ల పంట వస్తాది. రూ.8వేలే, 10వేలు అంటే రూ.80వేల నుంచి లచ్చ వరకూ వచ్చాది. పెట్టుబడి పోనూ మాకేం మిగుల్తాది? ఈ పరిస్థితుల్లో ఏ పండగ సేసుకుంటాం?' అని బాధపడ్డారు. ఇంతలో ఓ రైతు మాట్లాడుతూ.. 'కనీసం రైతుభరోసా, పంటల బీమా, ఇన్‌పుట్‌సబ్సిడీ వచ్చేవి... ఇప్పుడూ ఏదీ లేదు' అని అన్నారు. అక్కడి నుంచి ఊళ్లోకి వెళ్లాం. ఏ వీధిలో చూసినా జనం లేరు. తెల్లారితే భోగి. ఇళ్లిళ్లా బంధువులతో కళకళలాడుతూ ఉండాలి. అయితే ఏ ఇంటిబయట జనం కన్పించలేదు. ఓర్వకల్లు రోడ్డులోని ఓ వీధిలో వెంకటసుబ్బమ్మ అనే మహిళతో మాట్లాడాం. 'ఏం పెద్దమ్మా.. పండగ కదా.. బంధువులను పిలిపించుకున్నారా..' అని అడిగాం 'లేదయ్యా.. మామూలుగా ఇది కీడు పండుగ అని జరుపుకునేవాళ్లం కాదు..అయితే కొన్నేళ్లుగా కొత్తదుస్తులు తెచ్చుకుని, మంచి వంటలు చేసుకుని పండుగ చేసుకుంటున్నాం.. చేతిలో డబ్బు ఉంటే పండుగ.. లేకపోతే ఏ పండగ చేత్తాం.. పోయినసారి పిల్లోళ్లను పిలిపించుకుని పండగ సేసుకున్నాం.. ఈ ఏడాది ఎవర్నీ పిలవలేదు' అని చెప్పారు. పోయిన పండక్కి, ఇప్పడికి తేడా ఏంటి అని అడిగితే 'సూడయ్యా! రైతుభరోసా, చేయూత, అమ్మ ఒడి.. ఇలా ఏదో ఒక పథకం కింద జగన్ డబ్బులు ఇచ్చేవాడు. చేతిలో డబ్బుండేది. ఇప్పుడు ఏం డబ్బులొచ్చాండాయి. ఏదీ లేదు. మేం డబ్బులు లేకపోవడంతోనే పిల్లోళ్లను పిల్చుకురాలేదు. రూ.2వేలు తీసుకుపోతే సరుకులు వచ్చాండే! ఇప్పుడు రూ.5వేలు అయితేగానీ పండుగ సరుకులు రావు! రేట్లు పెరిగిపాయే.' అని చెప్పారు. 'ఊళ్లో చెన్నకేశవస్వామి గరుడస్తంభం ప్రతిష్ఠ ఉంది. అప్పుడు అందరిని పిల్చుకోవచ్చని ఈ దఫా పండుగ సేసుకోలేదయ్యా' అని చెప్పారు. పేరు చెప్పమంటే ''వద్దప్పా.. పేపర్లో పేరొస్తే ఆ పక్కోళ్లు ఇబ్బంది పెడతారు. ఏదీ వద్దు. '' అని బెదిరించారు. దీన్నిబట్టి చూస్తే ఊళ్లో కక్షసాధింపు రాజకీయాలు ఏస్థాయిలో ఉన్నాయో అర్థమైంది.

వలంటీర్లు లేక పాలన ఉందో లేదో తెలీని పరిస్థితి

కన్నమడకలలో పోయిన సంక్రాంతికి 13మంది వలంటీర్లు ఉండేవారు. ఇప్పుడు ఒక్కరూ లేరు. అలాగే పక్కనే ఉన్న ఓర్వకల్లులో 27మంది ఉండేవారు. వారూ లేరు. వీరే కాదు..జిల్లాలో 10వేలమందికిపైగా వలంటీర్లు ఉండేవారు. వీరికి నెలకు రూ.5వేలు కాదు, 10వేలు ఇస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ఆ వ్యవస్థనే మరుగున పడేసింది. ఓర్వకల్లులో నగేశ్ అనే వలంటీర్‌ను పలకరించాం. 'పోయిన పండక్కి నేను వలంటీర్‌ను. ఇప్పుడు రోజు కూలీని. అప్పుడు పదిమందికి ఉపయోగపడ్డా. ఇప్పుడు పని కోసం 10మంది వద్దకు వెళుతున్నా. ఏ రోజు ఏ పని ఉంటే ఆ పని చేసుకుంటూ నా భార్య, ఇద్దరు పిల్లలను బతికించుకుంటున్నా.' అని బాధపడ్డారు. ఇక్కడే సౌభాగ్యమ్మ అనే మహిళతో మాట్లాడితే 'సార్.. అప్పుడు ప్రతీ నెలా ఏదో ఒక పథకం ద్వారా ఇంట్లోకి డబ్బులు వస్తుండేవి. సంతోషంగా ఉండేవాళ్లం. సంతోషంగా ఉంటే రోజూ పండగే ' అన్నారు. ' వలంటీర్లు ఉన్నప్పుడు ప్రభుత్వం ఫలానా పథకం ఇస్తాంది.. అనే విషయం ప్రతీ ఇంటికి తెలిసేది. దరఖాస్తు నుంచి డబ్బు అకౌంట్‌లోకి జమ అయ్యే వరకూ తోడుండేవారు. ఇప్పుడు ప్రభుత్వ పాలన ఏంటో? ఏ పథకం ఇస్తున్నారో? ఎవ్వరికీ తెలీని పరిస్థితి' అని వలంటీర్లతో పాటు అక్కడ గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.





వెలవెలబోతున్న కాలనీ

- సాక్షిప్రతినిధి, కర్నూలు

నగదు చలామణి లేకపోవడం ప్రధాన కారణమే

రెండు గ్రామాల ప్రజలతో మాట్లాడితే నగదు చలామణి పూర్తిగా తగ్గిపోయిందని చెప్పారు. ఇప్పటి ప్రభుత్వం చెప్పినట్లు 'సూపర్‌సిక్స్' అమలు చేసి ఉంటే కర్నూలు జిల్లాలో ఈ ఏడాది రూ.4891.25కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో జమ అయ్యేవి. యువనేస్తం ద్వారా రూ.1678.85కోట్లు, ఆడబిడ్డనిధి కింద రూ.1635.50కోట్లు, అన్నదాత సుఖీభవ ద్వారా రూ.593.47కోట్లు, తల్లికి వందనం ద్వారా 727.93కోట్లు, ఉచిత బస్సు ద్వారా రూ.255.50కోట్లు లబ్ధిదారులకు మేలు జరిగేది. ఇవేవీ అమలు చేయలేదు. గత ప్రభుత్వంలో ఏటా పథకాలు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో చేరేవి. రెండు గ్రామాల్లో సచివాలయాలు, ఆర్బీకేలకు వెళ్లాం.. ఆదివారం కావడంతో తెరవలేదు. మామూలు రోజుల్లో కూడా వాటికి పెద్దగా పనిలేదు. రైతుభరోసా కేంద్రాలను పూర్తిగా నిర్వీర్యం చేశారు. అగ్రికల్చర్ అసిస్టెంట్ రోజూ రావడం వెళ్లడం మినహా వారికి ఏ పనిలేదని గ్రామస్తులు చెప్పారు. పథకాలు లేకపోవడంతో జనాల రాకపోకలు తగ్గి గ్రామ సచివాలయాలు కళ తప్పాయి. గతంలో ప్రభుత్వ భవనాల నిర్మాణాలు, సిమెంట్‌రోడ్లు, ఎయిర్‌పోర్టు, జైరాజ్ ఇస్పాత్‌తో పాటు పలు అభివృద్ధి పనులు జరిగేవి. సంక్షేమ పథకాలు వచ్చేవి. దీంతో నగదు చలామణి ఎక్కువగా ఉండేది. 'ఇప్పుడు సంక్షేమం లేదు, అభివృద్ధి లేదు. డబ్బు ఎక్కడ నుంచి ప్రజల చేతిలోకి వెళుతుంది.' అని ఓర్వకల్లు వాసి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. దీంతోనే పల్లెల్లో ఆ సం 'క్రాంతి' లేదని స్పష్టమైంది.



గ్రామాల్లో కనిపించని సంక్రాంతి సందడి

ఈ ఏడాది సంక్రాంతి ఏమీ లేదు



నాకు ఐదెకరాల పొలం ఉంది. నాలుగు ఎకరాల్లో పొగాకు, ఎకరాలో వరి సాగు చేశా. ఎకరాకు రూ.50 చొప్పున రూ.2.50లక్షలు పెట్టుబడి పెట్టా. పొగాకు రేటు లేదు. పొగాకు అమ్ముకుని అప్పులు కట్టి బయటపడాలి. ఆ తర్వాతే పండుగ. రైతుభరోసా లాంటి పథకాలు లేకపాయె. ఊళ్లో గరుడస్తంభం ప్రతిష్ఠ ఉంది. అప్పుడే పండగ సేసుకుంటాం. ఈ ఏడాది సంక్రాంతి ఏమీ లేదు. ఏదో సేసుకుని తినడం తప్ప.

– గోకారి, కన్నమడకల

పంట పండితేనే పండగ



నేను నాలుగు ఎకరాల్లో పొగాకు సాగు చేశా. పోయిన సంక్రాంతికి పంట చేతికి వచ్చింది. పొగాకు మొత్తానికి క్వింటా రూ.15వేల చొప్పున ఇచ్చారు. ఇప్పుడు తడి ఉందని వెనక్కి పంపిస్తున్నారు. పంట పండితేనే పండగ.. లేదంటే ఏమీ లేదు. పొలాలు మినహా ఏ ఆదాయం లేదు. ఖర్చులు పెరిగాయి. ఆదాయం ఏమీ లేదు. పని చేసుకుంటే బతకాల..లేదంటే లేదనే పరిస్థితి వచ్చింది. ఏ పండగ చేసుకుంటాం.

– వేణుగోపాల్, రైతు, కన్నమడకల



పొగాకు ఆరబెట్టుకోవడానికి పొలాల్లో బండలను పాతుతున్న దృశ్యం

సంప్రదాయ సంబరానికి వేళాయె!

- నేటి నుంచి నీలకంఠేశ్వర స్వామి తిరునాల
- 15న మహా రథోత్సవం
- నెలంతా ఎమ్మిగనూరులో సందడే సందడి



శ్రీనీలకంఠేశ్వరస్వామి దేవాలయం

ఎమ్మిగనూరు: హరహర మహాదేవుని ఆధ్యాత్మిక నామస్మరణలు.. సంప్రదాయాల మేళవింపు.. ఎద్దుల బండలాగుడు ప్రదర్శనలు.. క్రీడా పోటీలు.. కళాకారుల ప్రదర్శనల కలబోతే ఎమ్మిగనూరు జాతర. ఆడపడుచులకు చీరసారె, మట్టిగాజుల పంపకాలు.. బంధుమిత్రులకు సపర్యలు చేసి..ఆనందంగా జరుపుకునే జాతర ఎమ్మిగనూరు శ్రీ నీలకంఠేశ్వరుని తిరునాల. ఎక్కడైనా జాతరంటే ఒక రోజో.. రెండురోజులో.. మహా అయితే వారం రోజులో జరుగుతుంది. కానీ నెలంతా బంధుమిత్రులు, అతిథులతో ఎమ్మిగనూరు పట్టణం కళకళలాడిపోతుంది. ఆంధ్ర – కర్ణాటక సరిహద్దు ప్రాంతాల ప్రజల ఇలవేల్పు శ్రీ నీలకంఠేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఏటా కనుల పండువగా జరుగుతాయి. ఈనెల 13 నుంచి స్వామివారి ఉత్సవాలు మొదలవుతాయి. చుట్టు పక్కల ఎనభైకు పైగా గ్రామాల ప్రజలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకునే జాతర ఇది.

ఉత్సవాలు ఇలా..

నీలకంఠేశ్వరస్వామి ఉత్సవాలు ఈనెల 13 నుంచి మొదలై నెలరోజులపాటు (జాతర సంబరాలు) జరుగుతాయి. పౌర్ణమిన సోమవారం రాత్రి పార్వతి, పరమేశ్వరుల కల్యాణం వైభవంగా జరుపుతారు. గడిగె వంశీకులు వరుడు (పరమేశ్వరుని) తరుపున, బండా వంశీకులు పెళ్లి కుమార్తె (పార్వతీదేవి) తరుపున పెళ్లి పెద్దలుగా వ్యవహరించి కల్యాణం నిర్వహిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం తరుపున శాసన సభ్యులు బి.జయనాగేశ్వర రెడ్డి దంపతులు స్వామి వారికి పట్టువస్త్రాలను సంప్రదాయ బద్ధంగా సమర్పిస్తారు. 14వ తేదీ మంగళవారం రాత్రి ప్రభావళి మహోత్సవం, దేవదాయ శాఖ, ఆలయ ధర్మకర్తల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. 15వ తేదీ బుధవారం సాయంత్రం మహారథోత్సవం, 16వ తేదీ గురువారం రాత్రి 9 నుంచి 12 గంటల వరకూ వ్యాహావళి మహోత్సవం, 17న సాయంత్రం 9 గంటల వరకు తీర్థావళీ వసంతోత్సవం చేపట్టనున్నారు.

షాపింగ్‌మాల్‌గా తేరుబజారు..

మహారథోత్సవం ముగిసిన అనంతరం తేరుబజారు ప్రాంతం బహిరంగ షాపింగ్‌మాల్‌గా మారిపోతుంది. మట్టి గాజుల నుంచి గృహోపకరణాల దాకా జాతరలో దొరకని వస్తువంటూ ఉండదు. నవదంపతుల కొత్త కాపురానికి అవసరమైన సామగ్రిని జాతరలోనే కొనుక్కోవడం ఓ ఆచారం. ఎద్దుల సంత ఈ జాతర ప్రత్యేకత. ఒంగోలు గిత్తలూ, దేశవాళీ పశువులూ అమ్మకానికి ఉంటాయి. బండ్లూ నాగళ్లు వగైరా వ్యవసాయ సామగ్రిని కూడా విక్రయిస్తారు. జాతర రోజుల్లో పౌరాణిక నాటకాల ప్రదర్శన ఉంటుంది. సాంస్కృతిక, సాంఘిక పద్యాలు రంగస్థల వేదికల మీద మారుమోగి పోతాయి. రాష్ట్ర స్థాయి ఎద్దుల బలప్రదర్శన పోటీలు ఉంటాయి.

మహా రథోత్సవానికి సర్వం సిద్ధం..

స్వామివారి ఉత్సవాల్లో అత్యంత ముఖ్యమైంది మహారథోత్సవం. ఈనెల 15వ తేదీ బుధవారం సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు మహారథోత్సవం నిర్వహిస్తారు. స్వామివారి దేవాలయంలోని పార్వతీ పరమేశ్వరుల విగ్రహాలను సంప్రదాయ బద్ధంగా మేళతాళాలతో తీసుకొచ్చి తేరు బజారులోని రథంలో కూర్చోబెట్టి ఘనంగా ఊరేగిస్తారు. ఆ సమయానికి జిల్లా నలుమూలల నుంచే కాకా వివిధ రాష్ట్రాల నుంచి లక్షల మంది భక్తులు పోగవుతారు. అదేవిధంగా పార్టీలకు అతీతంగా స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు జిల్లా స్థాయి నేతలు, జిల్లా ఉన్నతాధికారులు పోగై పూజలు నిర్వహించటం, రథోత్సవంలో పాలుపంచుకోవటం ఇక్కడి ప్రత్యేకత. అందరూ జయజయ ధ్వానాలతో 'ఓం నమ:శివాయ' నామస్మరణ చేసుకొంటూ రథాన్ని లాగుతారు.



ప్రత్యేకాలంకరణలో శ్రీనీలకంఠేశ్వరస్వామి

44 ఏళ్లుగా స్వామివారి సేవలో



మా కుటుం సభ్యులే నాలుగు తరాలుగా వేడుకలు నిర్వహిస్తున్నాం. 44 సంవత్సరాలుగా శ్రీ నీలకంఠేశ్వర ఆలయంలో పార్వతీ పరమేశ్వరులకు కల్యాణం చేయించడం నా పూర్వజన్మ సుకృతం.. స్వామి వారి కల్యాణం తరువాత ప్రభావళి మహోత్సవం, మహా రథోత్సవం, తీర్థావళీ మహోత్సవం కార్యక్రమాలు నిర్వహిస్తాం.

– సత్యనారాయణ స్వామి, వేదపండితులు

ఆనాటి హృదయాల ఆనంద గీతం



వారంతా వివిధ హోదాల్లో ఉన్న వారు.. ఎమ్మిగనూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల 75 వసంతాల వేడుకలో కలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 56 సంవత్సరాల అనంతరం అ'పూర్వ' సమ్మేళనం ఘనంగా జరిగింది. పూర్వ విద్యార్థులంతా ఆటపాటలతో సందడి చేశారు.

- వివరాలు 10లో▸

భృంగి వాహనంపై ఊరేగిన మల్లన్న



ఆలయ ప్రదక్షిణ నిర్వహిస్తున్న దృశ్యం



ఆకట్టుకున్న కోలాటం

శ్రీశైలంటెంపుల్: మకర సంక్రాంతి బ్రహ్మోత్సవాలు శ్రీశైల మహక్షేత్రంలో వైభవంగా సాగుతున్నాయి. రెండో రోజు నుంచి వాహనసేవలు మొదలయ్యా యి. ఆదివారం రాత్రి భ్రమరాంబా సమేత శ్రీశైల మల్లికార్జునుడు భృంగి భుజ స్కందాలపై ఊరేగాడు. సాయంత్రం 6.30 గంటలకు ఆలయంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులను మేళతాళాల నడుమ తీసుకొచ్చి భృంగి వాహనంపై ఆశీనులు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తులకు ఉభయ దేవాలయాల ప్రధానార్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తరువాత భృంగివాహనాధీశులైన స్వామిఅమ్మవార్లను ఊరేగింపుగా ఆలయ ధ్వజస్తంభం వద్దకు తీసుకొచ్చి ప్రత్యేక హారతులు ఇచ్చారు. గంగాధర మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామ పురవీధుల్లో అంగరంగ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవంలో కళాకారుల నృత్యాలు, డప్పు వాయిద్యాలు, తప్పెట్లు, కోలాటం, పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అకట్టుకున్నాయి. ఈ పూజా కార్యక్రమాల్లో దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు దంపతులు, ఉభయ దేవాలయాల అర్చకులు పాల్గొన్నారు. మూడో రోజు సోమవారం శ్రీ భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామిఅమ్మవార్లు కైలాసవాహనంపై దర్శనమివ్వనున్నారు.

జీవితంలో ఒక్కసారైనా హజ్ యాత్ర చేయాలి

కర్నూలు కల్చరల్: ప్రతి ముస్లిం సోదరుడు జీవితంలో తప్పకుండా ఒక్కసారైన ఉమ్రా, హజ్ యాత్ర చేయాలని మహమ్మద్ ప్రవక్త బోధించాడని హాఫీజ్ ఫయాజ్ అలీ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని బీఏఎస్ కల్యాణ మండపంలో అల్ తవక్కల్ హజ్, ఉమ్రా ఆధ్వర్యంలో ఉమ్రా వెళ్లే యాత్రికులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రవక్త మార్గం ప్రపంచ మాన వాళికి ఆదర్శమన్నారు. ఉమ్రా యాత్రలో పాల్గొనడంతో దైవ భీతితో పాటు తోటి వారికి సాయం చేయాలన్న తపన ఏర్పడుతుందన్నారు. అనంతరం ఉమ్రాలో పాటించాల్సిన నియమాలపై యాత్రికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అల్ తవక్కల్ హజ్ మేనేజింగ్ డైరెక్టర్ హాఫీజ్ మహమ మద్ ఫయాజ్ అలీ, ముస్తాక్ అహమ్మద్, అలీ, మౌలానా ఇబ్రహీం పాల్గొన్నారు.

క్లుప్తంగా

మెట్ల మీద నుంచి జారిపడి మహిళ మృతి


లక్ష్మీదేవి (ఫైల్)

మద్దికెర: ఎం.అగ్రహారం గ్రామంలో మెట్ల మీద నుంచి జారి పడి ఓ మహిళ మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గంగన్న గారి లక్ష్మీదేవి (50) శనివారం ఇంట్లో మెట్ల మీద నుంచి జారిపడడంతో అపస్మారక స్థితిలో వెళ్లడంతో వెంటనే కుటుంబసభ్యులు వైద్య చికిత్స నిమిత్తం గుంతకల్లు వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతురాలికి భర్త నాగిరెడ్డి, ఇద్దరు కుమార్తెలు వున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కారులో మంటలు


సీ క్యాంప్ సెంటర్‌లో అగ్ని ప్రమాదానికి గురైన కారు

కర్నూలు: కర్నూలు సీ క్యాంప్ సెంటర్‌లో ఓ కారు అగ్ని ప్రమాదానికి గురైంది. నంద్యాల చెక్‌పోస్టు వైపు వెళ్తుండగా, అకస్మాత్తుగా బ్యాటరీలో షార్ట్ సర్క్యూట్ తలెత్తి మంటలు చెలరేగాయి. యజమాని పవన్‌కుమార్ అప్రమత్తమై అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు హుటాహుటిన అక్కడికి చేరుకొని మంటలను అదుపు చేశారు. శంషాబాద్‌కు చెందిన పవన్‌కుమార్ సొంత పనుల నిమిత్తం ఆదివారం కర్నూలుకు వచ్చారు. నంద్యాల చెక్‌పోస్టు వైపు వెళ్తుండగా ఈ ప్రమాదం సంభవించింది. ప్రమాదం వల్ల దాదాపు రూ.2 లక్షల నష్టం వాటిల్లినట్లు యజమాని అగ్నిమాపక సిబ్బందికి ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


మృతి చెందిన గోవిందరెడ్డి (ఫైల్)

హొళగుంద: ఆంధ్ర–కర్ణాటక మార్గంలోని మార్లమడికి రోడ్డులో ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ముద్దటమాగి గ్రామానికి చెందిన గోవిందరెడ్డి(39) ఆదివారం తెల్లవారుజామున మార్లమడికి రోడ్డులోని ఓ రైస్‌మిల్‌లో వరిధాన్యం ఆడించేందుకు ఆటోలో బయలుదేరాడు. రైస్‌మిల్ సమీపంలో అప్పటికే తాడ్ కోసం రోడ్డుపై నిలిచి ఉన్న లారీని ప్రమాదవశాత్తూ వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గోవిందరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య సుమిత్ర, ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. హొళగుంద ఎస్‌ఐ బాల నరసింహులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ జెడ్పీటీసీ మృతి


మాజీ జెడ్పీటీసీ చాంద్ బాషా

ఆళ్లగడ్డ: పట్టణ శివారులోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మాజీ జెడ్పీటీసీ సుద్ద పల్లె చాంద్ బాషా (38) మృత్యువాత పడ్డాడు. కోటకందుకూరు గ్రామానికి చెందిన చాంద్ బాషా ఆదివారం ఉదయం పట్టణానికి వచ్చాడు. పని ముగించుకుని మధ్యాహ్నం బైక్‌పై సొంతూరుకు వెళ్తుండగా పట్టణ శివారులోని గనిగుంతల సమీపంలో జాతీయ రహదారిపై ఆగిఉన్న ఆర్టీసీ బస్సును వెనక నుంచి ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ చాంద్ బాషాను స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా కొంతసేపటికే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

ఆనాటి హృదయాల ఆనంద గీతం


పూర్వ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న రిటైర్డ్ లోకాయుక్త ఐజీ నరసింహారెడ్డి


ప్లాటినం జూబ్లీ వేడుకల్లో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

- 75 వసంతాల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు
- గురువులకు ఘనంగా సత్కారం
- ఎమ్మిగనూరు ప్రభుత్వ హైస్కూల్‌లో సందడి

ఎమ్మిగనూరుటౌన్: 'ఎక్కడో పుట్టి.. ఎక్కడో పెరిగి.. ఇక్కడే కలిశాం.. చదువులమ్మ చెట్టునీడలో' అంటూ సినీ గేయకుడు రాసిన గేయంలా ఎక్కడెక్కడి నుంచో వచ్చిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ మహాసమ్మేళన సంబరం అంబరాన్నంటింది. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకొని 75 సంవత్సరాల తరువాత, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 56 సంవత్సరాల అనంతరం పూర్వ విద్యార్థులు ఒకే ప్రాంగణంలో కలుసుకొన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ప్లాటినం జూబ్లీ వేడుకలకు వందలాది మంది విద్యార్థులు కలిసి వచ్చారు. తమ గురువులను ఘనంగా సన్మానించి ఆటపాటలతో సందడి చేశారు. నాడు పనిచేసిన ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఓబులేసు, నాగభూషణం, లక్ష్మణరావు, వెంకటేశ్వర్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్, సుబ్బయ్య, బాలబ్రహ్మ, నసిరుద్దీన్, కె.అబిబుల్లా, వెంకటనారాయణ, శేషఫణి, సంజన్న, వెంకటేశ్వర్ రెడ్డి, ఈరన్న, నూర్‌అహమ్మద్, మహదేవ్, అమరప్రసాద్, కోటేశ్వరమ్మ, సుందరీబాయ్, పద్మిని, ఎంసి.నాగప్ప, లక్ష్మిదేవి, నిర్మలతో పాటు ప్రస్తుత హైస్కూల్ ఇంచార్జ్ హెచ్ఎం రాజారాంమోహన్, ప్రిన్సిపాల్ ప్రసాద్‌లను పూలమాల, శాలువాలు, మెమొంటోలతో సన్మానించారు. నాడు వారు నేర్పిన విద్యాబుద్ధులు, క్రమశిక్షణ గురించి వివరించారు. అంతకు మునుపు పద్మశ్రీ మాచాని సోమప్ప విగ్రహాన్ని పూలమాల వేసి ర్యాలీగా వచ్చి వేదికపై జ్యోతి ప్రజ్వలన అనంతరం విద్యార్థినిల సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రముఖ గజల్ గాయకుడు, పూర్వ విద్యార్థి, ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న మహమ్మద్‌మియ్యా గేయాలతో ఉర్రూతలుగించారు. పూర్వ విద్యార్థులు ప్రముఖ పారిశ్రామిక వేత్త మాచాని రఘునాథ్, తారకేష్, పాలకుర్తి తిక్కారెడ్డి, డీఆర్‌డీఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు ,పూర్వ ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రసంగించారు. కార్యక్రమంలో ప్లాటినం జూబ్లీ వేడుకల నిర్వాహకులు హరినారాయణరెడ్డి, బైలుప్పల షఫీవుల్లా, ఎంసి శివకుమార్, నటరాజ్‌రెడ్డి, మాచాని వెంకటేశ్వర్లు, ప్రకాష్‌జైన్, న్యాయవాది మల్లికార్జున, కామలే గణేష్, ఈరన్న గౌడ్, జబీర్‌బాషా పాల్గొన్నారు.


సెల్ఫీ తీసుకుంటూ మహిళా ఉపాధ్యాయినులు

విద్యార్థులకు ఇంగ్లిష్‌తో పాటు మాతృభాష నేర్పడం ఎంతో అవసరమని లోకాయుక్త రిటైర్డ్ ఐజీ నరసింహారెడ్డి పేర్కొన్నారు. రాయలసీమలో అత్యంత వెనుకబడిన ప్రాంతాల్లో కర్నూలు జిల్లాలోని పశ్చిమ ప్రాంతమని, దీన్ని అధిగమించాలంటే అక్షరాస్యత పెరగాలన్నారు.

సంతోషంగా ఉంది

పాఠశాల నిర్మాణం కోసం మాతాత సినిమా సోమన్న అప్పట్లో నాలుగు ఎకరాలు ఇచ్చారు.ఇప్పుడు 75 సంవత్సరాల తరువాత ప్లాటినం జూబ్లీ వేడుకలు నిర్వహించుకోవడం ఎంతో సంతోషంగా ఉంది.

– మాచాని ఎర్రిస్వామి, పూర్వ విద్యార్థి

మరచిపోలేనిది



పాఠశాలలో చదువుకున్న నాకు ఇప్పుడు 80 ఏళ్లు. ఈవేడుకలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉంది. సీనియర్ విద్యార్థినిగా నన్ను సత్కరించడం మరచిపోలేనిది.

– మహాదేవమ్మ, పూర్వ విద్యార్థిని


మధుర జ్ఞాపకం



ఇదే పాఠశాలలో చదువుకొని ఉపాధ్యాయినిగా పని చేశాను. ప్లాటినం జూబ్లీ వేడుకల్లో పాల్గొనడం ఆనందంగా ఉంది. వేడుకల్లో పాల్గొనడం మధుర జ్ఞాపకంగా మిగిలిపోతుంది.

– సుందరీబాయ్, రిటైర్డ్ ఉపాధ్యాయిని

అదృష్టంగా భావిస్తున్నా



నాకు 96 ఏళ్లు. ఈ వయసులో ప్లాటినం జూబ్లీ వేడుకలు చూడటం అదృష్టంగా భావిస్తున్నా. నా వయసు వాళ్లు ఎవరు లేక పోయినా వేడుకల్లో పాల్గొనడం, పూర్వ విద్యార్థిగా నన్ను నిర్వాహకులు సన్మానించడం ఆనందం కలిగిస్తోంది.

–డాక్టర్ ఎంసీ పంపణ్ణ

ప్రిన్సిపాల్ అయ్యా



ఎమ్మిగనూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1980–82 సంవత్సరంలో ఇంటర్మీడియట్ చదివాను. ప్రస్తుతం ఆదోనిలోని ఆర్ట్సుఅండ్ సైన్స్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పని చేస్తునా. ప్లాటినం జూబ్లీ వేడుకల్లో నన్ను సత్కరించడం ఎంతో సంతోషంగా ఉంది.నాటి స్నేహితులను కలుసుకోవడం మరచిపోనిది.

– అయ్యప్ప

ఎంతో గర్వంగా ఉంది



ఇక్కడ 1983– 1989లో చదివాను. అప్పట్లో టెన్త్ 560మార్కులతో పాఠశాలలో టాపర్‌గా నిలిచాను. అదే స్ఫూర్తితో చదువుకొని ప్రస్తుతం డీఆర్‌డీఓ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా హైదరాబాదులో పని చేస్తున్నా. రక్షణ శాఖలో నాగక్షిపణి తయారీలో పని చేశా. పూర్వ విద్యార్థుల మహాసమ్మేళనంలో నన్ను సత్కరించడం గర్వంగా ఉంది. – కె. శ్రీనివాసులు


తన చిన్ననాటి స్నేహితులతో ప్రముఖ పారిశ్రామిక వేత్త మాచాని రఘునాథ్


పాఠశాలకు ల్యాప్‌టాప్ విరాళంగా అందజేస్తున్న పూర్వ విద్యార్థి గట్టు నూర్‌అహమ్మద్

నరహరి కీర్తులకు కుంభాభిషేకం


నరహరి బృందవనానికి హారతులు పడుతున్న పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు

మంత్రాలయం: మధ్వమత పూర్వపు పీఠాధిపతి నరహరి కీర్తులకు కుంభాభిషేకం నిర్వహించారు. కర్ణాటక హంపిలోని తుంగభద్ర నది ఒడ్డున కొలువైన నరహరి కీర్తులకు రాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు విశేష పూజలు చేపట్టారు. ఆదివారం నరహరి తీర్థుల మూలబృందావనానికి మహాపంచామృతాభిషేకం, మహా కుంభాభిషేకం నిర్వహించి విశేష అలంకరణ చేశారు. ఈ వేడుక భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. వేడుకలు అనంతరం పీఠాధిపతి నరహరి కీర్తుల విశిష్టతను ప్రవచించారు. అనంతరం భక్తులకు కీర్త ప్రసాద వితరణ చేపట్టారు.

ప్రకృతిని కాపాడాలని పాదయాత్ర


పాదయాత్రలో సుమంత్ అశ్విన్

గోనెగండ్ల: 'ప్రకృతిని కాపాడండి.. నీటిని పొదుపు చేయాలి' అనే నినాదంతో దేశం మొత్తం పాదయాత్ర చేపట్టిన యువకుడు సుమంత్ అశ్విన్ ఆదివారం గోనెగండ్లకు చేరుకున్నాడు. సుమంత్ అశ్విన్ బెంగళూరుకు చెందిన యువకుడు. బెంగళూరులో బీటెక్ సెకండియర్ సీఎస్‌సీ చదువుతూ మధ్యలో వదిలేశాడు. ప్రకృతి, నీటి గొప్పతనాన్ని గురించి భారతదేశం అంతా తిరిగి ప్రజలకు తెలియజేయాలని గతేడాది జూన్ 2న కర్ణాటక నుంచి పాదయాత్ర మొదలు పెట్టాడు. రోజుకు 21 కిలోమీటర్ల ప్రకారం ఇప్పటికే 700 కిలోమీటర్లు నడిచినట్లు అశ్విన్ తెలిపారు. కర్నూలు మీదుగా తిరుపతి చేరి అక్కడ నుంచి చెన్నై చేరుకుంటానని చెప్పారు. గోనెగండ్ల యువకులు సుమంత్ అశ్విన్‌కు సాదరంగా ఆహ్వానం పలికి సాగనంపారు.

రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ విజేత 'నంద్యాల'


నంద్యాల జట్టుకు విజేత ట్రోఫీ అందజేస్తున్న పారిశ్రామిక వేత్త రామకృష్ణ పరమహంస

యాడికి: మండలంలోని రాయలచెరువులో శని, ఆదివారాల్లో జరిగిన రాష్ట్ర స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో నంద్యాల జట్టు విజయం సాధించింది. పోటీల్లో మొత్తం 24 జట్లు తలపడ్డాయి. నంద్యాల–వైజాగ్, ధర్మవరం –గుంటూరు, గుంటూరు–వైజాగ్ జట్ల మధ్య ఉత్కంఠ పోటీలు జరిగాయి. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో వైజాగ్ జట్టుపై నంద్యాల నంది పైపుల జట్టు గెలుపొంది. విజేత జట్లను అభినందిస్తూ పారిశ్రామిక వేత్త రామకృష్ణ పరమహంస, కత్తి రమేష్, ఎరువుల అంగడి సూరి నగదు పురస్కారాలు, ట్రోఫీలను అందజేశారు. తృతీయ స్థానంలో నిలిచిన బనగానపల్లి జట్టుకు వసీమ్ రాజా, నాల్గో స్థానంలో నిలిచిన రాయలచెరువు జట్టుకు రాజశేఖర్ నగదు పురస్కారాలను అందజేశారు. కాగా, పోటీలు చూసేందుకు పెద్ద సంఖ్యలో వచ్చిన ప్రజలకు గ్రామ పెద్దల ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. పోటీలను నిర్వాహకులు శంకర్ నాయుడు, రషీద్ షబ్బీర్ బాషా పర్యవేక్షించారు.

వైఎస్సార్‌సీపీ పాలనలోనే మంచి పనులు


సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి

- అప్పటి సీఎం వైఎస్ జగన్ కృషితోనే 'గ్రీన్‌కో' ప్రాజెక్టు
- డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఒప్పుకున్నందుకు అభినందనలు
- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: వైఎస్సార్‌సీపీ పాలనా కాలంలో మంచి పనులు జరిగాయనే విషయం ప్రజలందరికీ తెలుసుని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో పాణ్యం నియోజకవర్గం పిన్నాపురం సమీపంలో నిర్మించిన గ్రీన్‌కో ఇంటిగ్రేటెడ్ రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్టు భారతదేశంలో ఎక్కడలేని విధంగా ఉందని డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ మెచ్చుకోవడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ఆదివారం కాటసాని రాంభూపాల్ రెడ్డి స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2021లో ముఖ్యమంత్రి ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'గ్రీన్‌కో' ప్రాజెక్టును ప్రారంభించారన్నారు. ప్రాజెక్టు నిర్మాణం కోసం భూ సేకరణకు రైతులను ఒప్పించి వారికి ఎలాంటి నష్టం జరగకుండా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేశారన్నారు. ప్రాజెక్టును సందర్శించిన డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంచి జరిగిందని ఒప్పుకున్నందుకు ఆయనకు ధన్యావాదాలు అన్నారు. పిన్నాపురంలోని 212 సర్వే నంబర్‌లోని రైతులకు పరిహారం ఇస్తామని కంపెనీ హామీ ఇచ్చిందని, వారికి న్యాయం చేయాలని డిప్యూటీ సీఎంను కోరారు. సోలార్ పార్క్ ఎన్ని రోజుల్లో నిర్మాణం జరిగిందో, గ్రీన్‌కో పవర్ ప్రాజెక్టు ఎన్ని రోజుల్లో పూర్తయిందో ప్రజలందరికీ తెలుసునన్నారు. ఎన్నికల ముందు టీడీపీ నేతలు తనపై పలు ఆరోపణలు చేశారని, ఆధారాలు ఉంటే నిరూపించాలన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు వైజా అరుణ, లక్ష్మీకాంతరెడ్డి, విక్రమసింహారెడ్డి, నాయకులు మహేశ్వర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, హనుమంతురెడ్డి, రంగన్న పాల్గొన్నారు.

మహానందీశ్వరుడి సేవలో..



మహానంది: కర్నూలు జిల్లా ఎస్పీ బిందు మాధవ్ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం మహానందిలో పూజలు నిర్వహించారు. స్వామి వారి దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ సూపరింటెండెంట్ అంబటి శశిధర్ రెడ్డి స్వాగతం పలికారు. ఈ మేరకు వారు శ్రీ కామేశ్వరీ దేవి, శ్రీ మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. వేద పండితులు వారికి స్వామి అమ్మవారి ప్రసాదాలు అందించి ఆశీర్వచనాలు చేశారు.

కానిస్టేబుల్ ఆత్మహత్యాయత్నం

- రెండు నెలలుగా వీఆర్‌లోనే..
- నంద్యాల జిల్లాలో ఘటన


కానిస్టేబుల్ ఉమామహేశ్వర్ (ఫైల్)


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కానిస్టేబుల్ ఉమామహేశ్వర్


బొమ్మలసత్రం: జిల్లా కేంద్రం నంద్యాలలో రెండు నెలలుగా వీఆర్‌లో ఉన్న కానిస్టేబుల్ ఉమామహేశ్వర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికుల వివరాల మేరకు.. కొత్తపల్లి మండలం, గువ్వలకుంట్ల గ్రామానికి చెందిన ఎస్ ఉమామహేశ్వరరావు 2011లో కానిస్టేబుల్‌గా పోలీస్‌శాఖలో చేరాడు. రెండు నెలల క్రితం శ్రీశైలం పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న అతడు, విధులకు సరిగా హాజరు కావడం లేదనే కారణంతో వీఆర్‌కు పంపారు. దీంతో ఉమామహేశ్వరరావు రోజూ ఏఆర్ కార్యాలయానికి వెళ్లి రిజిస్టర్‌లో సంతకం చేసి వస్తున్నాడు. ఈ క్రమంలో 14 రోజులుగా సంతకం చేసేందుకు వెళ్లడం లేదు. ఆదివారం మద్యం సేవించి పోలీస్ క్వార్టర్‌లోని తన ఇంటికి వచ్చి భోజనం చేసి గదిలోకి వెళ్లి గడియవేసుకున్నాడు. అయితే కానిస్టేబుల్ ఉరి వేసుకుంటుండగా పక్కింటి వారు కిటికిలోంచి గమనించి అతని భార్య శకుంతలకు చెప్పడంతో తలుపులు బద్దలుకొట్టారు. ఉరికి వేలాడుతున్న ఉమామహేశ్వరరావును కిందకు దించి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కుటుంబ సభ్యులు పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కాగా, 14 రోజులుగా రిజిస్టర్‌లో సంతకం చేయని ఉమామహేశ్వర్ ఆదివారం ఏఆర్ కార్యాలయానికి వెళ్లగా, ఉన్నతాధికారుల అనుమతితో సంతకం చేయాలని అక్కడి సిబ్బంది స్పష్టం చేశారు. వారితో ఉమామహేశ్వర్ వాగ్వావాదానికి దిగాడు. అనంతరం ఇక తనకు ఉన్నతాధికారులు పోస్టింగ్ ఇవ్వరేమోనని మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నం చేసినట్లు బంధువులు అనుమానిస్తున్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

కర్నూలు: సంక్రాంతి పండుగ సందర్భంగా 13వ తేదీన ప్రభుత్వ సెలవు దినం కావడంతో సోమవారం నిర్వహించాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు వేసినట్లు ఎస్పీ బిందుమాధవ్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు సుదూర ప్రాంతాల నుంచి వ్యయ ప్రయాసాలతో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి రావద్దని పేర్కొన్నారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమణించాలని విజ్ఞప్తి చేశారు. ఇంటిల్లిపాదితో సంక్రాంతి పండుగను సంతోషంగా జరుపుకోవాలని కోరారు.

గిరిజన ఉపాధ్యాయుడి ఇల్లు కూల్చివేత

- బరితెగించిన అధికార పార్టీ నేత


బాధితుడు రాజునాయక్


ఇంటిని జేసీబీతో కూల్చి వేస్తున్న దృశ్యం

బనగానపల్లె రూరల్: కూటమి ప్రభుత్వం పాలనలో అరాచకాలు పెరిగిపోతున్నాయి. అక్రమాలకు అడ్డూఅదుపులేకుండాపోతోంది. తాజాగా బనగానపల్లె పట్టణంలో అధికార పార్టీ నాయకుడు గిరిజన ఉపాధ్యాయుడి ఇల్లును కూల్చివేశాడు. బాధితుడి తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని పసుపల తండా గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు రాజు నాయక్ బనగానపల్లె పట్టణంలోని శివనందినగర్ కాలనీలో షేక్ మహబూబ్‌బీ నుంచి 2022లో సర్వే నంబరు 81/1ఏ1ఏ లో ఇంటి నెంబరు 12–54ను రూ.2.30 లక్షలకు కొనుగోలు చేసి తన భార్య పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ప్రస్తుతం ఈ స్థలంలో తాత్కాలికంగా ఇల్లు ఉంది. ఈ ఇంటిని షేక్ మహబూబ్‌బీకి అద్దెకు ఇవ్వడం జరిగింది. అయితే, ఈ స్థలం తమదంటూ అధికార పార్టీకి చెందిన పట్టణ ఉపసర్పంచ్ బురానుద్దీన్‌తో పాటు కూటమి పార్టీకి చెందిన కొందరు నాయకులు శనివారం జేసీబీతో వచ్చి ఇంటిని కూల్చివేశారు. కష్టపడి సంపాదించుకున్న సొమ్ముతో స్థలం కొన్నానని, ఇప్పుడు తమదని ఆక్రమించుకోవడం సరికాదని దీనిపై స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు బాధితుడు తెలిపారు. కాగా కూల్చివేతపై ఉపసర్పంచ్ బురానుద్దీన్ వివరణ కోరగా.. రాజు నాయక్ ఆరోపణలో వాస్తవం లేదని, ఆ స్థలం తనదని చెప్పుకొచ్చారు.

హమ్మయ్యా.. బిడ్డ దొరికాడు

- గుట్టురట్టు అవుతుందని చిన్నారిని ఇంటి వద్దే వదిలిన దుండగులు


తల్లి చెంతకు చేరిన బాలుడు

కర్నూలు: కర్నూలు శివారుల్లోని కోడుమూరు రోడ్డులో గత నెల 20వ తేదీన అర్ధరాత్రి కిడ్నాపునకు గురైన ఎనిమిది నెలల చిన్నారి (ఆకాష్ రాథోడ్) ఎట్టకేలకు తల్లిదండ్రుల చెంతకు చేరాడు. 22 రోజులుగా పోలీసులు బృందాలుగా ఏర్పడి నిర్విరామంగా దర్యాప్తు ముమ్మరం చేయడంతో గుట్టురట్టు అవుతుందని భావించిన దుండగులు తల్లిదండ్రుల ఇంటి వద్ద బాలున్ని వదలి వెళ్లారు. బాలుడు క్షేమంగా తమ చెంతకు చేరడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. ఢిల్లీ ప్రాంతానికి చెందిన అజిత్‌రాథోడ్, ఆశా దంపతులు కొన్ని ఏళ్లుగా కోడుమూరు రోడ్డులో గుడిసెలు వేసుకొని రోడ్డుపై చిన్న పిల్లల బొమ్మలు, ఆటవస్తువులు అమ్ముకొని జీవనం సాగిస్తున్నారు. గత నెలలో తల్లిదండ్రుల వద్ద నిద్రిస్తున్న బాలున్ని గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేసినట్లు తల్లిదండ్రులు నాల్గవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కర్నూలు డీఎస్పీ బాబుప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసు అధికారులు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. అవకాశం ఉన్న అన్ని ప్రాంతాల్లోని సీసీ కెమెరాలను పరిశీలించారు. అనుమానిత వ్యక్తులను విచారించారు. జిల్లాలోని పలు ప్రాంతాలతో పాటు కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో కూడా గాలింపు చర్యలు చేపట్టారు. పోలీస్ చర్యల ఫలితంగా శనివారం రాత్రి 11 గంటల ప్రాంతంలో చిన్నారి ఆకస్మికంగా తల్లిదండ్రుల ఇంటి దగ్గర క్షేమంగా కనిపించాడు. అయితే కిడ్నాప్ చేసిన నిందితుల కోసం పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు. డీఎస్పీ బాబుప్రసాద్ బాధిత తల్లిదండ్రులను నాల్గవ పట్టణ పోలీస్ స్టేషన్‌కు పిలిపించి చిన్నారిని అప్పగించారు. దీంతో వారు పోలీస్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. దీంతో కథ సుఖాంతం అయ్యింది.

వివేకానంద జీవితం ఆదర్శం


మాట్లాడుతున్న సెట్కూరు సీఈఓ దీప్తి

కర్నూలు(హాస్పిటల్): ప్రపంచానికి భారత దేశ ఔన్నత్యాన్ని స్వామివివేకానంద చాటి చెప్పారని, స్వామి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా యువజన సంక్షేమ శాఖ–సెట్కూరు అధికారిణి పి. దీప్తి అన్నారు. స్వామి వివేకానంద జయంతి, జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం జిల్లా యువజన సంక్షేమ శాఖ–సెట్కూరు ఆధ్వర్యంలో స్థానిక రాజవిహార్ సర్కిల్‌లో ఉన్న స్వామి వివేకానంద విగ్రహానికి ఆమె పూలమాల వేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ స్వామి వివేకానంద జీవించినది కేవలం 39 సంవత్సరాలు మాత్రమే అయినా ప్రపంచ వ్యాప్తంగా ఎంతో పేరు తెచ్చుకున్నారన్నారు. రామకృష్ణ మఠాన్ని స్థాపించి ప్రజల్లో ఆధ్యాత్మిక చింతన పెంపొందించేందుకు కృషి చేశారన్నారు. వివేకానంద సూక్తులను యువత ఆచరణలో పెట్టి విజయం సాధించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి సంవత్సరం జనవరి 12న జాతీయ యువజన దినోత్సవంగా జరుపుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఏపీఎస్పీ డీఎస్పీ మహబూబ్‌బాషా, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతి తదితరులు పాల్గొన్నారు.